# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people




# ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్

ప్రారంభించిన అదనపు కలెక్టర్ ఎన్ రవి | 05


గురువారం 9, జూలై 2026 సంపుటి :03 సంచిక :143 పేజీలు :05 వెల ₹5




## రూ.15 కోట్ల సుపారీ డ్రామా భగ్నం

- ప్రముఖ వైద్యుడిపై పాత డ్రైవర్ పగ
- పనిలోంచి తీసేశారని మరో ఇద్దరితో కలిసి డాక్టర్‌కు బెదిరింపులు
- ములుగురోడ్డు వద్ద సినీ ఫక్కీలో నిందితులను వెంబడించి పట్టుకున్న పోలీసులు

04



## నిరంజన్ కన్నుమూత


- అరుదైన వ్యాధితో పోరాడి అలసిపోయిన 17 ఏళ్ల 'చిన్నారి'..
- ఇటీవలే పరామర్శించిన జనసేనాని పవన్ కల్యాణ్
- హనుమకొండలో విషాదం

04

ఇకపై 'మీసేవ' కేంద్రాల్లోనే యూరియా బుకింగ్

# రైతన్నకు 'మీసేవ' ఊరట!

స్మార్ట్ ఫోన్, యాప్స్ లేకపోయినా నో ప్రాబ్లమ్.. ఓటీపీ ఉంటే చాలు!




- 48 గంటల పాటు బుకింగ్ ఐడీ వాలిడిటీ.. బస్తాకు రూ.10 సర్వీస్ ఛార్జ్
- బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట వేసేలా ప్రభుత్వం సరికొత్త నిర్ణయం

రాష్ట్రంలోని సాగు రైతులకు తెలంగాణ ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. యూరియా కొనుగోలు ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులకు స్వస్తి పలుకుతూ విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. సాంకేతిక పరిజ్ఞానం లేక, స్మార్ట్‌ఫోన్లు వాడటం తెలియక సతమతమవుతున్న సామాన్య, నిరక్షరాస్య రైతులకు భరోసా కల్పిస్తూ.. ఇకపై నేరుగా 'మీసేవ' కేంద్రాల ద్వారానే యూరియా బుకింగ్ చేసుకునే వెసులుబాటును కల్పించింది. కేవలం మొబైల్ ఓటీపీ ఆధారంగా నిమిషాల వ్యవధిలోనే బుకింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా సరికొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది.

- అక్షరదర్బార్, హైదరాబాద్

03

"ఒక ఎమ్మెల్యేగా, ప్రజా ప్రతినిధిగా ఏ అధికారినైనా కలిసే హక్కు నాకు ఉంది. నా నియోజకవర్గ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం శాసనసభ్యుడిగా నా బాధ్యత" అని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తన పర్యటనలు, అధికారులతో భేటీలపై వస్తున్న వార్తలపై స్పందించారు. తనకు రూల్స్ తెలుసని, తాను ఎక్కడా నిబంధనలను అతిక్రమించలేదని ఆయన చెప్పారు.

– అక్షరదర్బార్, స్టేషన్ ఘనపూర్

05



# నా అధికారాలు.. పరిమితులు నాకు తెలుసు

- తప్పు చేయనప్పుడు ఎవరికీ వివరణ ఇవ్వనక్కర్లేదు
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జలపాతంలో పడి

## యువకుడు మృతి

- స్నేహితులతో కలిసి విహారయాత్రకు వచ్చి అనంతలోకాలకు
- జాలరుల సాయంతో మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు

04



## వీరాచారి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

○ పెద్దారపు రమేష్

అక్షరదర్బార్, దుగ్గొండి : సీపీఎం సీనియర్ నాయకుడు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కడియాల వీరాచారి ఆకస్మిక మరణం ప్రజా ఉద్యమాలకు, కమ్యూనిస్టు నిర్మాణానికి తీరని లోటని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన వీరాచారి మృతదేహాన్ని రమేష్ సందర్శించి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరాచారి తుది శ్వాస వరకు సమసమాజ స్థాపన కోసం పనిచేశాడని, నల్లబెల్లి మండలంలో అనేక భూ పోరాటాలను నిర్వహించాడని కొనియాడారు. ఆయన అంతిమయాత్రలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న పాడిన విప్లవ గీతాలు కంటతడి పెట్టించాయి. ఈ కార్యక్రమంలో దామ సాంబయ్య, మార్త నాగరాజు పాల్గొన్నారు.

## మత్తుకు దూరంగా.. చదువుకు దగ్గరగా

### విద్యార్థులకు పోలీసుల పిలుపు

అక్షరదర్బార్, ములుగు : విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ములుగు సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వీరేందర్ సూచించారు. బండారుపల్లి పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాలలో నిర్వహించిన మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. మత్తు పదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక దుష్పరిణామాలను వివరించారు. అనంతరం విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేసి, బండారుపల్లి గ్రామంలో ప్లకార్డులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దీప్తి, ప్రిన్సిపాల్ దేవకి, అధ్యాపకులు సదానందం, అయాజ్ ఖాన్ పాల్గొన్నారు.




# ఆలయాన్ని రాజకీయాల్లోకి లాగొద్దు

## కాళేశ్వరం ప్రతిష్ఠను దెబ్బతీయొద్దు

- దేవస్థానం చైర్మన్ మోహన్ శర్మ
- పుష్కరాల కవర్లకు దేవస్థానానికి ఎలాంటి సంబంధం లేదు
- ప్రభుత్వ కార్యక్రమాలను ఆలయానికి అంటగట్టడం దురుద్దేశపూర్వక ప్రచారం
- భక్తుల విశ్వాసాలతో రాజకీయాలు చేయడం మానుకోవాలి
- పుట్ట మధుకర్ ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలు, నిరాధారాలు



కాళేశ్వరం, అక్షర దర్బార్: మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఇటీవల శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానంపై చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలు, నిరాధారాలు, రాజకీయ ప్రేరేపితమైనవని దేవస్థానం చైర్మన్ మోహన్ శర్మ, ధర్మకర్తల మండలి తీవ్రంగా ఖండించింది. కోట్లాది మంది హిందూ భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన దక్షిణకాశీ కాళేశ్వరాన్ని రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం అత్యంత దురదృష్టకరమని పేర్కొంది. సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా దేవస్థానం తరఫున ఎలాంటి చీరల కిట్లు, కవర్లు పంపిణీ చేయలేదని స్పష్టం చేసింది. ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన కవర్లు, వస్త్రాలను దేవస్థానానికి అంటగట్టడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని పేర్కొంది. దేవస్థానం తరఫున ముద్రించే ఏ వస్తువుపైనైనా స్వామివారి చిత్రం, దేవస్థానం పేరు మాత్రమే ఉంటుందని, ప్రభుత్వం లేదా మంత్రుల ఫోటోలు ఉండే అవకాశం లేదని వివరించింది. ప్రభుత్వ కార్యక్రమాలపై ఎవరైనా ప్రశ్నలు అడగాలంటే ప్రభుత్వాన్నే ప్రశ్నించాలని, కానీ ప్రతి అంశాన్ని దేవస్థానానికి ముడిపెట్టి పవిత్ర క్షేత్ర ప్రతిష్ఠను దెబ్బతీయడం సరికాదని మండిపడింది. కాళేశ్వరం దేవస్థానం ఏ ఒక్క వ్యక్తికి లేదా రాజకీయ పార్టీకి చెందినది కాదని, ఇది కోట్లాది మంది హిందూ భక్తుల ఆరాధ్య దైవక్షేత్రమని గుర్తు చేసింది. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని పేర్కొంది. పుష్కరాల సందర్భంగా కాశీ నుంచి వేదపండితులను ఆహ్వానించడాన్ని విమర్శించడం కూడా సమంజసం కాదని తెలిపింది. కాశీ గంగా హారతి సంప్రదాయాన్ని కాళేశ్వరంలో నిర్వహించడం ద్వారా కాశీ వెళ్లలేని భక్తులకు అదే ఆధ్యాత్మిక అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని వివరించింది. స్థానిక అర్చకులు, వేదపండితుల సమక్షంలోనే అన్ని కార్యక్రమాలు నిర్వహించామని, స్థానిక బ్రాహ్మణులను ఎక్కడా అవమానించలేదని స్పష్టం చేసింది. గతంలో గోదావరి పుష్కరాలను నిర్వహించినప్పుడు కాశీ సంప్రదాయాన్ని తీసుకురాని వారు, ఇప్పుడు భక్తుల కోసం చేపడుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఎందుకు విమర్శిస్తున్నారని ప్రశ్నించింది. గతంలో యాదాద్రి, బాసర, వేములవాడ, భద్రాచలం వంటి దేవాలయాల అభివృద్ధిని ఎవరూ రాజకీయ కోణంలో చూడలేదని, కాళేశ్వరం విషయంలో మాత్రమే పదేపదే ఆరోపణలు చేస్తూ ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీయాలని ప్రయత్నించడం వెనుక ఉద్దేశం ఏమిటో ప్రజలకు చెప్పాలని పుట్ట మధుకర్‌ను డిమాండ్ చేసింది. సమాచార హక్కు చట్టం పేరుతో కూడా ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అధికారులు ఇచ్చే సమాధానాలకు దేవస్థానాన్ని బాధ్యులను చేయడం సరికాదని పేర్కొంది. చట్టం తన పని తాను చేస్తుందని, ప్రతి అంశాన్ని దేవస్థానానికి ముడిపెట్టడం రాజకీయ ప్రచారమేనని విమర్శించింది. కాళేశ్వరం దేవస్థానం అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, పుష్కరాల విజయవంతమైన నిర్వహణ కోసం దేవాదాయ శాఖ, ప్రభుత్వం, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపింది. ఇలాంటి సమయంలో నిరాధార ఆరోపణలు చేయడం వల్ల ఆలయ ప్రతిష్ఠకు మాత్రమే నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. పవిత్ర దేవస్థానాలను రాజకీయాలకు వేదికగా మార్చకుండా భక్తుల విశ్వాసాలను గౌరవించాలని, దక్షిణకాశీగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కాళేశ్వరం ప్రతిష్ఠను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని దేవస్థానం చైర్మన్ మోహన్ శర్మ, ధర్మకర్తల మండలి విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ మోహన్ శర్మతో పాటు ధర్మకర్తలు దొడ్డ అశోక్, కుంబం పద్మ, అడ్డూరి శ్రీధర్ రావు, బీసుల నర్సయ్య, మంచినీళ్ల దుర్గయ్య, గందెసిరి సత్యనారాయణ, సుంకరి సీతయ్య, జలవంచ సీతారాం, కాటం సత్తయ్య, శ్యామ్ సుందర్, తాటిపెల్లి రాజయ్య, ప్రశాంత్ రెడ్డి పాల్గొని దేవస్థానంపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని, భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ కాళేశ్వరం పవిత్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

## కందగట్ల కాంతమ్మ కుటుంబానికి పద్మశాలి సంఘం ఆర్థిక సాయం

అక్షరదర్బార్, శాయంపేట : శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన పద్మశాలీ పరపతి సంఘం సభ్యురాలు కందగట్ల కాంతమ్మ మృతి చెందగా, మృతురాలి కుటుంబ సభ్యులకు సంఘం తరపున రూ. 5,000ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు సంఘం ప్రతినిధులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి పరపతి సంఘం అధ్యక్షుడు కందగట్ల పరమాత్మ, కార్యవర్గ సభ్యులు బంక జోగయ్య, గుర్రం రమేష్, కందగట్ల ప్రవీణ్ కుమార్, సూర్యనారాయణ, చందనల శేఖర్ పాల్గొన్నారు.






## వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన పథకాలు చారిత్రాత్మకం

### దూదిపాల బుచ్చిరెడ్డి

అక్షరదర్బార్, శాయంపేట : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నిరుపేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలు చారిత్రాత్మకమని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి కొనియాడారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో వైఎస్ఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్, ఫీజు రియంబర్స్మెంట్ వంటి పథకాలు బడుగుల అభ్యున్నతికి తోడ్పడ్డాయని, ఆయన ఆశయాలకు అనుగుణంగా పని చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మారపెల్లి రవీందర్, చల్లా చక్రపాణి, దుబాసి కృష్ణమూర్తి పాల్గొన్నారు.



## నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ముఖ్యం

ఎస్సై పరమేష్

అక్షరదర్బార్, శాయంపేట : శాయంపేట మండలం జోగంపల్లి గ్రామంలో సర్పంచ్ మారబోయిన ప్రభాకర్, గ్రామ పెద్ద కౌటం లక్ష్మీనారాయణ, వార్డు సభ్యుల సహకారంతో రూ. 25 వేల విలువైన నాలుగు సోలార్ సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ఎస్సై పరమేష్ సమక్షంలో డెమోన్స్ట్రేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజలు, పెద్దలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ప్రతి ఇంటి ఆవరణలో తంగేడు మొక్కలు నాటాలి

బడుగు సునీల్

అక్షరదర్బార్, శాయంపేట : తెలంగాణ రాష్ట్ర పుష్పమైన తంగేడు మొక్కలను పరిరక్షించడం, విస్తృతంగా పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తంగేడు మొక్కల పెంపకం మందరిపేట గ్రామ అధ్యక్షుడు బడుగు సునీల్ అన్నారు. బుధవారం కమిటీ సభ్యులతో కలిసి మందారిపేట గ్రామ నర్సరీని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన రహదారులు, చెరువు కట్టలు, ఇంటి ఆవరణలలో మొక్కలు నాటేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు. ప్రస్తుతం 5 వేల విత్తనాలను సమకూర్చి నర్సరీలో మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టామని, తంగేడును పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాజర్ల శంకర్, నిమ్మల రాజ్ కుమార్, వలుస పృథ్వి, బొట్టు రత్నాకర్, బొట్టు రణధీర్ పాల్గొన్నారు.



## డీసీసీ బ్యాంక్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి

అక్షరదర్బార్, వెంకటాపూర్ : వరంగల్ డీసీసీ బ్యాంక్ ములుగు శాఖ, వెంకటాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో నాబార్డ్ ఆర్థిక సహకారంతో బుధవారం జవహర్ నగర్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ములుగు బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ డీసీసీ బ్యాంక్ అందిస్తున్న సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. పొదుపు ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల ప్రాముఖ్యతతో పాటు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్షా బీమా యోజన, కేవైసీ విధానాలు మరియు వివిధ రకాల రుణ సౌకర్యాల గురించి రైతులకు, ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాదుగుల సురేష్, శ్రీకాంత్, కోటయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.




# రామప్ప అమేజింగ్ ఆలయం


- స్కాట్లాండ్ పర్యాటకుల ప్రశంసలు

**అక్షరదర్బార్, వెంకటాపూర్ : ప్రపంచ పర్యాటక ప్రాంతమైన రామప్ప ఆలయాన్ని బుధవారం స్కాట్లాండ్ దేశస్థులు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ గైడ్ తాడబోయిన వెంకటేష్ రామప్ప శిల్పకళా వైశిష్ట్యాన్ని, చరిత్రను వారికి వివరించగా, రామప్ప ఒక అమేజింగ్ ఆలయమని పర్యాటకులు కొనియాడారు.**



# రైతులకు శుభవార్త

- ఇకపై 'మీసేవ' కేంద్రాల్లోనే యూరియా బుకింగ్
- స్మార్ట్‌ఫోన్, యాప్ లేకపోయినా ఇబ్బంది లేదు. ఓటీపీ ఉంటే చాలు
- ప్రభుత్వం సరికొత్త నిర్ణయం




అక్షరదర్బార్, హైదరాబాద్: రాష్ట్రంలోని రైతులకు తెలంగాణ ప్రభుత్వం మరో ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఇకపై యూరియా కొనుగోలు ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ.. 'మీసేవ' కేంద్రాల ద్వారానే యూరియా బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్‌ఫోన్లు లేక, యాప్‌లు ఉపయోగించడం తెలియక ఇబ్బందులు పడుతున్న సామాన్య రైతులకు ఈ నిర్ణయం ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. ఈ నూతన విధానానికి సంబంధించిన పూర్తి వివరాలు, నిబంధనలు ఇలా ఉన్నాయి:

**ఓటీపీ ధృవీకరణతో నిమిషాల్లో బుకింగ్**

ఇకపై యూరియా కావాలనుకునే రైతులు తమకు దగ్గరలోని మీసేవ కేంద్రానికి వెళ్లి బుక్ చేసుకోవచ్చు. మొబైల్ యాప్స్ వాడాల్సిన అవసరం లేకుండానే.. కేవలం మీసేవ కేంద్రంలో తమ వివరాలు అందించి, మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని ధృవీకరించడం ద్వారా వెంటనే యూరియా బుకింగ్ ప్రక్రియను పూర్తి చేయవచ్చు.

**48 గంటల పాటు బుకింగ్ ఐడీ వాలిడిటీ**

మీసేవ కేంద్రంలో బుకింగ్ పూర్తి కాగానే రైతు మొబైల్‌కు ఒక 'బుకింగ్ ఐడీ' వస్తుంది. ఈ బుకింగ్ ఐడీ 48 గంటల పాటు (రెండు రోజులు) అమల్లో ఉంటుంది. రైతులు ఈ లోపు ఎప్పుడైనా వెళ్లి తమ యూరియా బస్తాలను డెలివరీ తీసుకోవచ్చు.

**ఎంపిక చేసిన డీలర్ల వద్దే కొనుగోలు**

రైతులు మీసేవ కేంద్రంలో బుక్ చేసుకునే సమయంలోనే తాము ఏ డీలర్ వద్ద యూరియా తీసుకోవాలో ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. బుకింగ్ పూర్తయ్యాక, సదరు ఎంపిక చేసిన డీలర్ దగ్గరకు వెళ్లి బుకింగ్ ఐడీని చూపించి యూరియా బస్తాలను కొనుగోలు చేయవచ్చు.

### సర్వీస్ ఛార్జీ ఎంతంటే?

**మీసేవ కేంద్రాల ద్వారా అందించే ఈ సేవల కోసం ప్రభుత్వం నామమాత్రపు రుసుమును నిర్ణయించింది. రైతులు బుక్ చేసుకునే ప్రతి యూరియా బస్తాకు రూ. 10 చొప్పున మీసేవ కేంద్రంలో రుసుము చెల్లించాల్సి ఉంటుంది. బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట వేయడానికి, నిజమైన రైతులకు సకాలంలో యూరియా అందించడానికి ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.**



## ముచింపుల నుంచి హన్మకొండకు బస్సు సౌకర్యం కల్పించాలి

అక్షరదర్బార్, నల్లబెల్లి : ముచింపుల నుండి వయా రంగాపురం, రేలకుంట గ్రామాల మీదుగా హన్మకొండకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకులు బొట్ల నరేష్, మార్త నాగరాజు బుధవారం ఆర్టీసీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాసంస్థలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా శనిగరం, ముచింపుల, దస్తగిరిపల్లె, రంగాపురం, రేలకుంట, నందిగామ గ్రామాలకు బస్సు సౌకర్యం లేదన్నారు. దీనివల్ల నర్సంపేట, హన్మకొండ, ములుగు వెళ్లే విద్యార్థులు నిత్యం ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ, కాలినడకన వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఈ రూట్లలో బస్సులు నడపాలని కోరారు.



# నిరంజన్ కన్నుమూత

- అరుదైన వ్యాధితో పోరాడి అలసిపోయిన 17 ఏళ్ల 'చిన్నారి'..
- ఇటీవలే పరామర్శించిన జనసేనాని పవన్ కల్యాణ్
- హనుమకొండలో విషాదం

అక్షరదర్బార్, హనుమకొండ: జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీరాభిమాని, హనుమకొండకు చెందిన కురుమద్దాల నిరంజన్ (17) బుధవారం అనారోగ్యంతో కన్నుమూశారు. గత కొంతకాలంగా అరుదైన ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న నిరంజన్, పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఈ వార్తతో హనుమకొండతో పాటు జనసైనికుల్లో తీవ్ర విషాదం నెలకొంది.

**మూడేళ్ల వయసు నుంచే అరుదైన వ్యాధి..**

హనుమకొండకు చెందిన నిరంజన్ మూడేళ్ల ప్రాయంలోనే ఒక అరుదైన జన్యుపరమైన వ్యాధి బారిన పడ్డారు. వయసు పెరుగుతున్నా శారీరక ఎదుగుదల లోపించింది. ప్రస్తుతం అతనికి 17 ఏళ్లు నిండినప్పటికీ, శారీరకంగా మాత్రం కేవలం నాలుగేళ్ల చిన్నారిలాగే కనిపించేవాడు. కాలంతో పాటు వయసు పెరిగినా, శరీరం సహకరించకపోవడంతో ఆ బాలుడు ఎన్నో ఏళ్లుగా నరకయాతన అనుభవించాడు.

**నెరవేరిన కల**

నిరంజన్‌కు పవన్ కల్యాణ్ అంటే ప్రాణం. ఎలాగైనా తన అభిమాన హీరోను కలవాలనేది ఆ బాలుడి జీవితకాల కోరిక. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా జనసేనాని దృష్టికి వెళ్లడంతో, పవన్ కల్యాణ్ చలించిపోయారు. ఇటీవల హనుమకొండ పర్యటనకు వచ్చిన సమయంలో పవన్ కల్యాణ్ స్వయంగా నిరంజన్ నివాసానికి వెళ్లారు. బాలుడిని ఎత్తుకుని, గుండెలకు హత్తుకుని ముద్దాడారు. ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి, ఆర్థిక సాయం కూడా అందజేశారు. తన ప్రాణ సమానమైన హీరోను అంత దగ్గరగా చూసి, ఆయన ఒడిలో తలవాల్చిన సమయంలో నిరంజన్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. "నా కొడుకు చివరి కోరికను పవన్ కల్యాణ్ తీర్చారు. ఆ జ్ఞాపకాలతోనే వాడు ప్రశాంతంగా కన్నుమూశాడు" అని నిరంజన్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు

**తీరని లోటు..**

తమ అభిమాన నటుడిని కలిసిన కొద్ది రోజులకే నిరంజన్ మరణించడం పవన్ కల్యాణ్ అభిమానులను, జనసేన శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. సోషల్ మీడియా వేదికగా పవన్ కల్యాణ్ అభిమానులు, స్థానిక నాయకులు నిరంజన్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు.

# నేడు కొత్తూరులో ప్రత్యేక గ్రీవెన్స్

అక్షరదర్బార్, రాయపర్తి: రాయపర్తి మండలంలోని కొత్తూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు ఒక ప్రత్యేక గ్రీవెన్స్ (సమస్యల పరిష్కార) కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పంచాయతీ కార్యదర్శి ప్రకటించారు. సర్పంచి కందికట్ల స్వప్న సంతోష్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాష్ ఉదయం 11 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ ప్రత్యేక గ్రీవెన్స్ లోపరిష్కరించబడేవి ఇళ్ల పన్ను, నీటి సరఫరా, పేరు మార్పిడి (మ్యుటేషన్) సమస్యలు, గ్రామపంచాయతీ సేవల్లో వచ్చే ఇబ్బందులని పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు. వీటిలో ఎలాంటి సమస్యలు ఉన్నా, వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు (పత్రాలు) వెంట తీసుకొని గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగే ప్రత్యేక గ్రీవెన్స్ కు రావాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ ప్రజలను కోరారు.

# రూ.15 కోట్ల సుపారీ డ్రామా భగ్నం

- ప్రముఖ వైద్యుడిపై పాత డ్రైవర్ పగ
- పనిలోంచి తీసేశారని మరో ఇద్దరితో కలిసి డాక్టర్‌కు బెదిరింపులు
- ములుగురోడ్డు వద్ద సినీ ఫక్కీలో నిందితులను వెంబడించి పట్టుకున్న పోలీసులు





అక్షరదర్బార్, హనుమకొండ: వైద్యో నారాయణో హరి అంటారు.. కానీ ఆ డాక్టరే ప్రాణాలు కాపాడే దేవుడిలా భావించి ఆశ్రయమిస్తే, నమ్మిన బంట్రే నట్టేట ముంచాలని చూశాడు. హనుమకొండ నగరంలో ఓ ప్రముఖ వైద్యుడిని భయభ్రాంతులకు గురిచేసి ఏకంగా రూ.15 కోట్లు వసూలు చేయాలని చూసిన పాత డ్రైవర్ కుట్రను పోలీసులు చాకచక్యంగా భగ్నం చేశారు. సినిమా కథను తలపించే ఈ క్రైమ్ స్టోరీ వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండకు చెందిన సదరు ప్రముఖ వైద్యుడి వద్ద గతంలో సుభాష్ అనే వ్యక్తి డ్రైవర్‌గా పని చేశాడు. అయితే, కొన్ని కారణాల వల్ల వైద్యుడు అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో డాక్టర్‌పై తీవ్ర కక్ష పెంచుకున్న సుభాష్, ఎలాగైనా అతడి నుంచి భారీగా డబ్బులు గుంజాలని ప్లాన్ చేశాడు. ఇందుకోసం మరో ఇద్దరు స్నేహితులను తోడు చేసుకుని పెద్ద స్కెచ్ వేశాడు.

**'నిన్ను చంపడానికి సుపారీ వచ్చింది' అంటూ బెదిరింపులు**

పథకంలో భాగంగా నిందితులు వైద్యుడికి ఫోన్ చేసి భయపెట్టడం ప్రారంభించారు. "నిన్ను నడిరోడ్డుపై హత్య చేయడానికి మాకు భారీగా సుపారీ (డబ్బులు) అందింది. నువ్వు ప్రాణాలతో ఉండాలంటే మాకు రూ.15 కోట్లు ఇవ్వాలి" అంటూ బెదిరింపులకు దిగారు. వరుస కాల్స్‌తో డాక్టర్‌ను తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేశారు. నిందితుల బెదిరింపులతో షాక్‌కు గురైన వైద్యుడు.. చివరకు ధైర్యం చేసి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

**ములుగురోడ్డు వద్ద చేజింగ్..**

బాధితుడి ఫిర్యాదుతో హనుమకొండ పోలీసులు రంగంలోకి దిగారు. సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో స్థానిక ములుగు రోడ్డు పరిసరాల్లో నిందితులు సంచరిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది.

పోలీస్ బృందం అక్కడకు చేరుకోగానే, వారిని చూసి నిందితులు మోటార్‌సైకిల్‌పై పారిపోయేందుకు ప్రయత్నించారు. అయితే అప్రమత్తమైన పోలీసులు నిందితులను సినీ ఫక్కీలో వెంబడించి, చుట్టుముట్టి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి బెదిరింపులకు ఉపయోగించిన 4 మొబైల్ ఫోన్లు, పరారవ్వడానికి ప్రయత్నించిన ఒక బైక్‌ను పోలీసులు సీజ్ చేశారు.

# గవర్నర్ పర్యటన షెడ్యూల్



అక్షరదర్బార్, హనుమకొండ: రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం వరంగల్ నగరంలో పర్యటించనున్నారు. 7.20 గంటలు ఆయన నగరంలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 8 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరే గవర్నర్ 10.30 గంటలకు హనుమకొండ నిట్ లోని గెస్ట్ హౌస్ కు చేరుకుంటారు. 10.50 గంటలకు హనుమకొండ ఐడీఓసీలో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన స్టాల్ లను రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సందర్శించి స్వయం సహాయక సంఘాల సభ్యులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11.20 గంటలకు హనుమకొండ ఐడీఓసీలో వరంగల్, హనుమకొండ జిల్లాల జిల్లా అధికారులతో గవర్నర్ సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1.20 గంటలకు హనుమకొండ ఐడీఓసీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు నిర్వహించనున్న నషా ముక్త్ భారత్ ర్యాలీని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1.50 గంటలకు లంచ్ కు నిట్ గెస్ట్ హౌస్ కు చేరుకుంటారు. 3.35 గంటలకు హన్మకొండ రెడ్ క్రాస్ సొసైటీని గవర్నర్ సందర్శిస్తారు. సాయంత్రం 4.15 గంటలకు హన్మకొండ పెద్దమ్మగడ్డలోని టీజీటీడబ్ల్యూఆర్ బాలికల సెంటర్ ఆఫ్ ఎక్స లెన్స్ ను సందర్శించి విద్యార్థులతో గవర్నర్ ముఖాముఖి నిర్వహించనున్నారు. సాయంత్రం 4.40 గంటలకు శ్రీ భద్రకాళి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దర్శించుకుంటారు. తర్వాత 5.40 గంటలకు నిట్ గెస్ట్ హౌస్ కి చేరుకుని 5.50 గంటలకు హైదరాబాద్ బయల్దేరుతారు.

# జలపాతంలో పడి యువకుడు మృతి

- స్నేహితులతో కలిసి విహారయాత్రకు వచ్చి అనంతలోకాలకు
- జాలరుల సాయంతో మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు

అక్షరదర్బార్, వాజేడు: పర్యాటక ప్రాంతంలో సరదాగా గడుపుదామని వచ్చిన విహారయాత్ర ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని నిషేధిత దూలాపురం జలపాతం (వాటర్ ఫాల్స్) లో పడి ఓ యువకుడు ప్రమాదవశాత్తు గల్లంతై మృతి చెందాడు. మృతుడు సిద్దిపేట జిల్లాకు చెందినవాడిగా పోలీసులు గుర్తించారు. ఈ విషాదకర ఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లాకు చెందిన యాద వైభవ్ (22) అనే యువకుడు తన స్నేహితులతో కలిసి ములుగు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చాడు. ఈ క్రమంలో వాజేడు మండలంలోని దూలాపురం జలపాతానికి చేరుకున్నారు. అయితే, ప్రమాదకరమైన ప్రాంతం కావడంతో అధికారులు ఈ జలపాతంలోకి ప్రవేశాన్ని పక్షాల క్రితమే నిషేధించారు. అయినప్పటికీ, నిబంధనలను పక్కనబెట్టి యువకులు జలపాతం వద్దకు వెళ్లారు. అక్కడ ప్రమాదవశాత్తు వైభవ్ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి, గల్లంతయ్యాడు.

**డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం**

జలపాతంలో యువకుడు మునిగిపోవడాన్ని గమనించిన తోటి పర్యాటకులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమై డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే వాజేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక జాలరుల (మత్స్యకారుల) సాయంతో జలపాతంలో గాలింపు చర్యలు చేపట్టారు. తీవ్ర శ్రమనంతరం వైభవ్ మృతదేహాన్ని నీటి నుంచి బయటకు వెలికితీశారు.

**పోస్టుమార్టంకు తరలింపు.. విచారణ**

పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, తదుపరి పోస్టుమార్టం నిమిత్తం వాజేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చేతికి అందిన కొడుకు కళ్ల ముందే శవమైపోవడంతో స్నేహితులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# నా అధికారాలు.. పరిమితులు నాకు తెలుసు

- తప్పు చేయనప్పుడు ఎవరికీ వివరణ ఇవ్వనక్కర్లేదు
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



అక్షరదర్బార్, స్టేషన్ ఘనపూర్: "ఒక ఎమ్మెల్యేగా, ప్రజా ప్రతినిధిగా ఏ అధికారినైనా కలిసే హక్కు నాకు ఉంది. నా నియోజకవర్గ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం శాసనసభ్యుడిగా నా బాధ్యత" అని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తన పర్యటనలు, అధికారులతో భేటీలపై వస్తున్న వార్తలపై స్పందించారు. తనకు రూల్స్ తెలుసని, తాను ఎక్కడా నిబంధనలను అతిక్రమించలేదని ఆయన చెప్పారు. బిజినెస్ రూల్స్, రాజ్యాంగం ప్రకారం క్యాబినెట్ ర్యాంక్ ఉన్నవారు మాత్రమే సమీక్షలు నిర్వహిస్తారని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందులో పాల్గొంటారనే విషయం తనకు పూర్తిగా తెలుసన్నారు. తన నియోజకవర్గ పరిధిలోని ఆలయాల అభివృద్ధి కోసమే తాను దేవాదాయ శాఖ కమిషనర్ గారిని వారి కార్యాలయంలో కలిశానని వివరించారు. ఆలయ కమిటీ చైర్మన్లతో కలిసి పలు వినతి పత్రాలు అందజేయడం జరిగిందని, ఇందులో ఎలాంటి రాజకీయం లేదన్నారు. "నేను ఎలాంటి తప్పూ చేయలేదు.. కాబట్టి ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం నాకు లేదు. కొందరు అవగాహనా లోపంతో మాట్లాడుతున్నారు" అని విమర్శించారు. తనపై ఇలాంటి తప్పుడు వార్తలు రావడం బాధాకరమని అన్నారు.

**అభివృద్ధిని వదిలేసి.. వివాదాలు సృష్టిస్తున్నారు**

ప్రజల మధ్య ఉండని వారు, నియోజకవర్గ అభివృద్ధి గురించి ఆలోచించని వారే కేవలం కాంట్రావర్సీలు సృష్టించి వార్తల్లో ఉండాలని చూస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎన్నో సమస్యలు ఉంటే, వాటిని పట్టించుకునే వారే లేకుండా పోయారని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితులపై శ్రీహరి పలు ప్రశ్నలను సంధించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అత్యంత కీలకమైన 'దేవాదుల' ప్రాజెక్టుపై దృష్టి పెట్టాల్సిన బాధ్యత ఎవరిది?, ఉమ్మడి జిల్లాకు దిక్కైన ఎంజీఎం ఆసుపత్రికి సూపరింటెండెంట్ లేకపోయినా ఎందుకు పట్టించుకోవడం లేదు?, ప్రతిష్టాత్మక సూపర్ స్పెషలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి నోచుకోకుండా పడి ఉంటే చొరవ చూపే నాథుడే లేడా?, నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ టెండర్లు పూర్తి చేయించి, పనులు ప్రారంభించాల్సింది ఎవరు అధికారాన్ని ప్రజల సమస్యల పరిష్కారం కోసం, ప్రజా శ్రేయస్సు కోసం ఉపయోగించాలి తప్ప.. ఇలాంటి వృథా కాంట్రావర్సీల కోసం కాదని కడియం పేర్కొన్నారు. తనకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా దేవాదాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే కడియం సమీక్ష నిర్వహించటంపై మంత్రి కొండా సురేఖ సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కడియం స్పందన పొలిటికల్ గా చర్చనీయాంశమైంది.

# ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్

## ప్రారంభించిన అదనపు కలెక్టర్ ఎన్ రవి

అక్షరదర్బార్, హనుమకొండ: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్–2026) కార్యక్రమంలో భాగంగా హనుమకొండ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఓటర్ల సౌకర్యార్థం ఈ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన సందేహాలు, ఓటరు నమోదు, పేరు, చిరునామా, ఇతర వివరాల మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి ప్రజలు హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, రాజు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు జగత్ సింగ్, రెవెన్యూ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



## ఇడుపులపాయలో వైఎస్ఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించిన మల్లేశం గౌడ్

అక్షరదర్బార్, పరకాల : కడప జిల్లా ఇడుపులపాయలోని వైఎస్ఆర్ స్మృతి వనంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను పురస్కరించుకుని వైఎస్ షర్మిల నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆముదాలపెల్లి మల్లేశం గౌడ్ పాల్గొని వైఎస్ఆర్ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మల్లేశం గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ఆర్ ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ వంటి చారిత్రాత్మక పథకాలను ప్రవేశపెట్టి నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు.





## తాహేరపూర్‌లో సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ శంకుస్థాపన

అక్షరదర్బార్, శాయంపేట : శాయంపేట మండలంలోని తాహేరపూర్ గ్రామం 7, 9 వార్డులలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ కుక్కల సరోజన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రభుత్వ సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నిలుపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రావుల శ్రీనివాస్, చలివాగు ప్రాజెక్ట్ డైరెక్టర్ కుక్కల తిరుపతి, వార్డు సభ్యులు మీదేపాక మధుకర్, ఓర్స్ రవి పాల్గొన్నారు.

## అక్షర దర్బార్ కథనానికి స్పందన

- గుంతలకు గుడ్‌బై.. రోడ్లకు మరమ్మతులు
- కాంక్రీట్‌తో పూడ్చిన అధికారులు..
- హర్షం వ్యక్తం చేసిన పట్టణ ప్రజలు

అక్షర దర్బార్ ఎఫెక్ట్

అక్షర దర్బార్,పరకాల: పరకాల పట్టణంలోని ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనదారులు, ప్రజలు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారంటూ 'గుంతల రోడ్లతో నిత్యం ప్రమాదాలు' శీర్షికతో అక్షర దర్బార్‌లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే చర్యలు చేపట్టి రోడ్డుపై ఉన్న గుంతలను కాంక్రీట్‌తో పూడ్చి మరమ్మతులు నిర్వహించారు. రోడ్ల సమస్యపై వెలుగులోకి తీసుకొచ్చిన కథనం ఫలితంగా తక్షణ చర్యలు చేపట్టడంపై స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలికితీస్తూ, పరిష్కారం దిశగా కృషి చేస్తున్న అక్షర దర్బార్ పత్రికకు పరకాల పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా పాత్ర కీలకమని వారు అభిప్రాయపడ్డారు.

## వీబీజీఎఫ్‌లో ఉత్తమ ఉద్యోగులకు ఘన సన్మానం

అక్షరదర్బార్, పరకాల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (వీబీజీఎఫ్/ఎంజీఎన్ఆర్ఈజీఎస్)లో 2025–26 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక పని దినాలు నమోదు చేసి, విధులను సమర్థవంతంగా నిర్వహించిన ఉద్యోగులను బుధవారం ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిషత్ ఇన్‌చార్జి అభివృద్ధి అధికారి రామకృష్ణ, మండల పరిషత్ సూపరింటెండెంట్, ఏపీఓ ఇందిర శాలువాలు కప్పి ఉద్యోగులను అభినందించారు. నాగారం గ్రామపంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ గడ్డం కోమల, గ్రామపంచాయతీ కార్యదర్శి కిరణ్, టెక్నికల్ అసిస్టెంట్ సుమలత, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీకాంత్‌తో పాటు లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ చిరంజీవి, గ్రామపంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్, కంప్యూటర్ ఆపరేటర్ మొగిలిని ఉత్తమ ఉద్యోగులుగా గుర్తించి సన్మానించారు.